క్లుప్తంగా

టైలరింగ్లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సంతనూతలపాడు: మండలంలోని మహిళలు టైలరింగ్లో ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సురేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు



పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట పశువుల హాస్పిటల్లో బుధవారం జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిని డాక్టర్ కే బేబీరాణి పాల్గొని పరిశీలించారు. టీకాల వలన కలిగే ఉపయోగాలపై పశుపోషకులకు బేబీరాణి అవగాహన కల్పించారు. వేసవిలో పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారికి వివరించారు. 54 పశువులకు టీకాలు వేశారు. పశువైద్యాధికారి డాక్టర్ పి.చిరంజీవి, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరీక్షల సమయంలో నాణ్యమైన ఆహారం అందించాలి

- ఎంఈవో–2 పద్మావతి



కేజీబీవీని తనిఖీ చేస్తున్న ఎంఈవో–2 పద్మావతి

కొత్తపట్నం: విద్యార్థులకు పరీక్షల సమయంలో ఆహారంలో అన్ని పోషకాలు అందేలా చూడాలని ఎంఈవో–2 పద్మావతి ఆదేశించారు. మండలంలోని మోటుమాలలో కేజీబీవీని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వండిన అన్నం, కూరలను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ పరీక్షలు ఉన్నన్ని రోజులు విద్యార్థులకు రాజీపడకుండా నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. ఆహారం విషయంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. గదులు, వంట గదులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులను రాత్రి పొద్దుపోయేంత వరకు చదివించాలని కోరారు. ఆరోగ్య సమస్యలు వస్తే మందులు కూడా అందుబాటులో ఉంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

పరీక్ష ఓ చోట.. వెళ్లింది మరోచోటకు..!



బైక్పై విద్యార్థినిని తీసుకెళ్తున్న ట్రాఫిక్ ఎస్సై అహరోన్

మార్కాపురం: మార్కాపురం మండలం కొండేపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థిని బుధవారం ఉదయం మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల కేంద్రానికి బదులు హడావుడిలో బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్లింది. పరీక్ష సమయం దగ్గర పడటంతో ఆందోళనతో దిక్కులు చూస్తుండగా ట్రాఫిక్ ఎస్సై అహరోన్ గమనించారు. హుటాహుటిన తన బైక్పై తీసుకెళ్లి జెడ్పీ బాలికోన్నత పాఠశాల వద్ద వదిలిపెట్టడంతో ఆ విద్యార్థిని ఊపిరి పీల్చుకుంది. ట్రాఫిక్ ఎస్సైని సీఐ సుబ్బారావు, డీఎస్పీ నాగరాజు అభినందించారు.

వ్యవసాయ యాంత్రీకరణకు దరఖాస్తు చేసుకోండి

కురిచేడు: మండలంలోని రైతులు వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.మధు బాబు కోరారు. వ్యవసాయశాఖ ద్వారా ఎఫ్ఎం పథకంలో భాగంగా రైతులకు రాయితీతో కూడిన వ్యవసాయ పనిముట్లకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఆయన చెప్పారు. మండలానికి రూ.4.461 లక్షల సబ్సిడీ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్ సామాన్లు, మందు పంపులు, పీవీసీ పైపులు వంటివి ప్రభుత్వ రాయితీలో పొందవచ్చని వివరించారు. మరింత సమాచారం కోసం ఆయా గ్రామాల పరిధిలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని ఏఓ మధు బాబు సూచించారు.



బుద్ధుడి విగ్రహం వద్ద వందనం కార్యక్రమంలో పాల్గొన్న బుద్ధిస్టులు

అక్రమ కేసులు సిగ్గుచేటు

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటాం
- పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరు రవిబాబు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ నాయకులు అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జి చుండూరు రవిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు అక్రమ కేసు పెట్టగా, ఒంగోలులోని జిల్లా జైలులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తను బుధవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా చుండూరు రవిబాబు మాట్లాడుతూ నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఈర్ల సాయిపై టీడీపీ నాయకులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అన్నివేళలా ఈర్ల సాయికి అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జైలు బయట మాట్లాడుతున్న చుండూరు రవిబాబు



రాఘవరావుకు నివాళులర్పిస్తున్న చుండూరు రవిబాబు

రాఘవరావుకు చుండూరు రవిబాబు నివాళులు

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కాసుల రాఘవరావు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జ్ చుండూరు రవిబాబు ఒంగోలులోని భాగ్యనగర్లో రాఘవరావు నివాసం వద్ద పూలమాలలతో నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకుడు లంకపోతు అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడిపై టీడీపీ నేత దాడి



జీజీహెచ్లో చికిత్స పొందుతున్న భాస్కర్ను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు సిటీ: నగరంలోని కొత్తపట్నం బస్టాండ్ వద్ద బుధవారం సాయంత్రం వైఎస్సార్ సీపీ 16వ డివిజన్ ప్రెసిడెంట్ పాట్లూరి భాస్కర్పై పాత కక్షల నేపథ్యంలో ఒంగోలు కమ్మపాలేనికి చెందిన టీడీపీ నాయకుడు ఈదర బాబి దాడి చేశాడు. కులం పేరుతో దూషించి దాడిచేసి గాయపరచడంతో పాటు భాస్కర్కి చెందిన ఆటో అద్దాలు పగలగొట్టాడు. గతంలో భాస్కర్–బాబీ మధ్య జరిగిన వివాదంపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కోర్టులో పెండింగ్లో ఉంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాబి రెచ్చిపోయి ఇప్పుడు మా ప్రభుత్వం వచ్చింది.. ఇప్పుడు పెట్టరా కేసు అంటూ మళ్లీ కులం పేరుతో దూషించి దాడి చేసినట్లు ఒంగోలు జీజీహెచ్లో చికిత్స పొందుతున్న భాస్కర్ తెలిపారు. భాస్కర్ను వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్చార్జ్ చుండూరి రవిబాబు ఆదేశాల మేరకు పార్టీ ఒంగోలు నగర అధ్యక్షుడు కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు నగరికంటి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఇమ్రాన్, ప్రవీణ్కుమార్, పార్టీ డివిజన్ నాయకులు రాజేష్, శ్రీనివాసరెడ్డి, పి.శ్రీనివాసరావు పరామర్శించారు.

కనిగిరి నుంచి వసతి గృహాన్ని తరలించవద్దు

ఒంగోల వన్టౌన్: కనిగిరిలోని ఎస్సీ బాలుర ప్రీమెట్రిక్ వసతి గృహాన్ని అక్కడి నుంచి తరలించవద్దని కోరుతూ లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఒంగోలులోని ప్రగతి భవన్లో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ను కలిసి వినతి పత్రం అందించారు. వసతి గృహంలో విద్యార్థులు లేరనే సాకుతో అక్కడి నుంచి తరలించనున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులను చేర్పేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. డీడీ స్పందిస్తూ ఇప్పటికిప్పుడు వసతి గృహాన్ని తరలించేందుకు ఎటువంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు. కార్యక్రమంలో లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.కేశవులు, డి.బుద్ధకోటి, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

22న జిల్లాస్థాయి హాకీ జట్ల ఎంపిక

సంతనూతలపాడు: హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీ సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హాకీ జిల్లాస్థాయి జూనియర్ బాలబాలికల జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏవీ రమణారెడ్డి, ఏ సుందరరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 9 గంటలకు రావాలన్నారు. 01/01/2006 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు. పూర్తి వివరాలకు పీఈటీ తిరుమలశెట్టి రవికుమార్ (9951578357)ను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చీమకుర్తి రూరల్: మండలంలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నిమిత్తం గురువారం పి.నాయుడుపాలెం, పాటిమీదపాలెం, బండ్లమూడి, తొర్రగుడిపాడు, ఎర్రగుడిపాడు, మంచికలపాడు గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గృహాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్.మోహన్రావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఒంగోలు నగరం నరకం

ఒంగోలు టౌన్: నిత్యం సమస్యలతో ఒంగోలు నగరం నరకంగా మారిందని, అడుగడుగునా అనేక సమస్యలు తిష్టవేసి ప్రజలను ఇబ్బందుల పాలుచేస్తున్నాయని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నగర సమస్యలను అధ్యయనం చేయడానికి, ప్రజలను చైతన్యం చేయడానికి ఈ నెల 8 నుంచి 17వ తేదీ వరకు ప్రజా చైతన్య యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. బృందాలుగా విడిపోయి 35 డివిజన్లలో యాత్ర చేసినట్లు చెప్పారు. నగరంలో ఎటుచూసినా మురుగునీటి సమస్య ఎక్కువగా కనిపిస్తోందని, ఎక్కడికక్కడ కాలువల్లో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వేస్తోందని తెలిపారు. మురుగునీటి వలన దోమలు పెరిగిపోయి జనం వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. పోతురాజు కాలువలో పేరుకుపోయిన జమ్ము, తుంగ, ఇతర పదార్థాలను తొలగించాలన్నారు. నగరంలో దోమల బెడద ఎక్కువగా ఉందని, ఫాగింగ్ చేయకుండా మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నగరంలో కుక్కల బెడద ప్రజలను భయాందోళనకు గురిచేస్తోందన్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వం నగరంలో ఇళ్లు లేని 20,840 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి సెంటు చొప్పున ఇంటి స్థలాలు ఇచ్చిందని, ప్రస్తుత ప్రభుత్వం రెండు సెంట్ల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నప్పటికీ కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితమయ్యారని, ఇంటి స్థలాల సమస్యను మాత్రం తేల్చడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా పేద ప్రజలకు పొజిషన్ చూపించాలని కోరారు. చింతల, కొప్పోలు వద్ద 4,128 మందికి జీ ప్లస్ త్రీ పద్ధతిలో టిడ్కో గృహాలు నిర్మించి ఇస్తామని చెప్పారని, ఇప్పటి వరకు లబ్ధిదారులకు గృహాలు ఇవ్వలేదన్నారు. ఇప్పటికే నగరంలో ఇల్లు కట్టుకున్న పేదలకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు. నగరంలో మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తున్న మంచినీరు సరిపోవడం లేదని చెప్పారు. రాత్రి పూట నీరు విడుదల చేయడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శివారు ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా వారానికి ఒకసారి మాత్రమే నీళ్లు సరఫరా చేస్తున్నారని, కనీసం మూడు రోజులకో సారైనా నీరివ్వాలని, ట్యాంకర్ల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఫిల్టర్ బెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటికి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. కొప్పోలు చెరువును మూడో సమ్మర్ స్టోరేజీ ట్యాంకుగా మార్చాలని, బత్తులవారి పంటలను మంచినీటి చెరువుగా మార్చి అభివృద్ధి చేయాలని కోరారు. నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జి.రమేష్, తంబి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూరు శాతం ప్రకృతి వ్యవసాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుభాషిణి

- ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుభాషిణి

కొత్తపట్నం: మండలంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో నూరు శాతం ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి సిబ్బందిని ఆదేశించారు. రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన, వెలుగు సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ ప్రతి గ్రామ సంఘం పరిధిలోని స్వయం సహాయక సంఘం ద్వారా ప్రతి రైతూ సాగుచేయబోయే మొత్తం విస్తీర్ణం, పంట పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. తద్వారా రాబోయే సంవత్సరం నిర్దిష్టమైన ప్రణాళిక, లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయం చేసే వీలుంటుందని తెలిపారు. అంతేగాకుండా ప్రతి రైతు కచ్చితంగా ప్రకృతి వ్యవసాయం చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలని వివరించారు. ఇందుకోసం వ్యవసాయ, ఉద్యానవన, వెలుగు సిబ్బంది సహకారం అవసరమన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. ఏరియా కో ఆర్డినేటర్ విజయమ్మ, అగ్రికల్చర్ ఆఫీసర్ మోహన్రెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు ఏసమ్మ, ఏపీఎం విజయలక్ష్మి, మండల విస్తరణాధికారి అజయ్ కుమార్, వీఏఏలు, వీవోఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నరసింహులు, కొట్టం, రెడ్డప్ప, ఇందిర, యూనిట్ ఇన్చార్జిలు, ఐసీఆర్పీలు పాల్గొన్నారు.

మనుషులంతా సమానమే

ఒంగోలు వన్టౌన్: మనుషులంతా సమానమేనని, ఒకరినొకరు దోచుకోకూడదని మాతాశిశు సంక్షేమశాఖ విశ్రాంత జేడీ కరణం రాఘవరావు అన్నారు. ఒంగోలులో బౌద్ధ ధర్మ ప్రచార సమితి నిర్వహించిన ధర్మ ప్రచార యాత్రలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. బౌద్ధ ధర్మాన్ని ఆచరిస్తున్న ప్రపంచ దేశాలు ప్రగతిసాధిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా భారతీయులంతా బౌద్ధ ధర్మం ఆచరించి దేశ సమగ్రతకు, అభివృద్ధికి దోహదపడాలని కోరారు. స్థానిక ప్రకాశం భవనం నుంచి మిరియాలపాలెం సెంటర్, కబాడీపాలెం సెంటర్, కమ్మపాలెం బుద్ధ విగ్రహం వరకూ యాత్ర సాగింది. విగ్రహం వద్ద బుద్ధ వందనం, పంచశీల ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ సుధాకర్బాబు, ఓపీడీఆర్ రాష్ట్ర నాయకుడు సుధాకరరావు, రైతు సంఘ నాయకుడు సీహెచ్ రంగారావు, బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా అధ్యక్షుడు వై.మహేష్నాగ, బుద్ధిస్టులు పాల్గొన్నారు.

మంచినీటి వసతి కల్పించాలి



చీమకుర్తి క్రిస్టియన్పాలెంలో ప్రజల సమస్యలడిగి తెలుసుకుంటున్న సీపీఎం నాయకులు

చీమకుర్తి: స్థానిక క్రిస్టియన్పాలెంలో తాగునీటి ఎద్దడితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే మంచినీటి వసతి కల్పించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రామతీర్థం జలాశయం నుంచి అనేక ప్రాంతాలకు మంచినీటి సరఫరా జరుగుతోందని, కానీ, రామతీర్థం జలాశయం కింద ఉన్న చీమకుర్తి క్రిస్టియన్పాలేనికి నీటివసతి లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. జిల్లా అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.వెంకటరావు, పి.ఆంజనేయులు, టి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై వ్యవసాయ పనిముట్లు

సంతనూతలపాడు: మండలంలోని పేర్నమిట్ట–1, మంగమూరు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు మండల వ్యవసాయ అధికారిణి పి.పావని మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు ఈ పంట నమోదు, ఈకేవైసీ రబీ సీజనులో పూర్తయిందని తెలిపారు. ఆయా జాబితాలను సోషల్ ఆడిట్ గ్రామ సభల ద్వారా రైతులందరికీ తెలియపరిచామన్నారు. ప్రస్తుతం రైతులకు 50 శాతం రాయితీపై ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లు అందిస్తోందని, కావాల్సిన రైతులు అవసరమైన పత్రాలతో రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను కలవాలని తెలిపారు. ఇప్పటివరకు భూసార పరీక్షలు చేయించుకోని రైతులు మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి పంపాలని చెప్పారు. భూసార పరీక్ష పత్రాలు పొంది తదనుగుణంగా ఎరువులు వాడాలని సూచించారు. మండలంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందని రైతులు వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి రిజిస్టర్ చేయించుకోవాలని తెలిపారు. క్లస్టర్ డెమోన్స్ట్రేషన్ ప్రోగ్రాంలో భాగంగా మంగమూరులో సాగుచేసిన శనగ పంటను పరిశీలించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వి.వి.శేషమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం సాగు చేసి వున్న శనగ పంటలో యాజమాన్య పద్ధతుల గురించి తెలిపారు. ఎన్పీఎస్ఎస్ యాప్ గురించి వివరించారు. రైతుల సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఎస్.వెంకటరావు, కె.వి.సుబ్బారెడ్డి, పేర్నమిట్ట, మంగమూరు గ్రామాల వ్యవసాయ సహాయకులు సి.జానకి, ఎం.సౌజన్య, ఆయా గ్రామాలు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల వ్యవసాయ అధికారిణి పావని

మల్లవరం దేవాలయానికి అదనంగా ఆదాయం



ఆలయంలో దుకాణాలకు వేలం నిర్వహిస్తున్న కార్యనిర్వహణాధికారి నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్ వేణు

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లవరం వెంకటేశ్వరస్వామి దేవాలయానికి ఈ ఏడాది అదనంగా ఆదాయం లభించినట్లు వేలం నిర్వహణాధికారి దామా నాగేశ్వరరావు తెలిపారు. దేవాలయ పరిధిలో ఉన్న దుకాణాలకు వేలం ద్వారా ఈ సంవత్సరం 10,72,000 రూపాయలు వచ్చినట్లు చెప్పారు. గత సంవత్సరం 9,34,500 రూపాయలు రాగా, ఈ సంవత్సరం 1,37,500 రూపాయలు అదనంగా వచ్చినట్లు వెల్లడించారు. బుధవారం నిర్వహించిన వేలంలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు 1,46,000 రూపాయలకు, టీ, టిఫిన్, కూల్ డ్రింక్‌లు, తినుబండారాలు అమ్ముకునే హక్కు 1,74,000 రూపాయలకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు 45,000 రూపాయలకు సుబ్బాయమ్మ దక్కించుకున్నారు. పెండ్లి మండపం ఏర్పాటు చేసుకునే హక్కు రూ.3,80,000కి షేక్ మీరావలి దక్కించుకోగా జనరేటర్పై లైటింగ్ వేసుకునే హక్కును 2,66,000 రూపాయలకు శివ రామకృష్ణ దక్కించుకున్నారు. ఐస్క్రీమ్ అమ్ముకునే హక్కు 22,000 రూపాయలకు, బొమ్మల అంగడి ఏర్పాటు చేసుకునే హక్కు 29,000 రూపాయలకు నాగమణి దక్కించుకోగా, సోడాలు అమ్ముకునే హక్కును 10,000 రూపాయలకు లంక సుబ్బారావు దక్కించుకున్నట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్స్పెక్టర్ వేణు, పలువురు గ్రామస్తులు, పాటదారులు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపు



స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

ఒంగోలు సిటీ: భూస్వామ్య కుటుంబంలో పుట్టి ఆ భూస్వాముల దురాగతాలపైనే తుపాకీ ఎక్కుపెట్టి పటేల్ పట్వారీల దారుణాలకు వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ రైతాంగ పోరాట యోధురాలు.. మల్లు స్వరాజ్యం అని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే, మహిళా ఉద్యమ నేత, తెలంగాణ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం తృతీయ వర్ధంతిని బుధవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి పూర్వం మహిళలు సనాతన సంప్రదాయాలకు కట్టుబడి ఇంటి నుంచి బయటకు రాలేని స్థితిలో ఆయుధాలు పట్టి సాయుధ పోరాటంలో నిలిచిన వీరమాత మల్లు స్వరాజ్యం అని అన్నారు. 500 ఎకరాల భూములు కలిగిన పెద్ద భూస్వామ్య కుటుంబంలో పుట్టిన స్వరాజ్యం.. గ్రామీణ పేదలు, రైతు కూలీల హక్కుల కోసం 13 ఏళ్ల వయసులోనే సాయుధ పోరాటంలో నిలిచారని అన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఆ వీర తెలంగాణ విప్లవ పోరాటం ఫలితంగా లక్షలాది ఎకరాల భూములు పేదలకు దక్కాయని తెలిపారు. వెట్టి చాకిరి నిర్మూలించాలని జరిగిన ఉద్యమాలకు నాయకత్వం వహించడమే కాకుండా నీ బానిసను దొర, నీ కాలు మొక్కుతా అంటూ బతికే అణగారిన ప్రజల చేతులకు ఆయుధాలు పట్టించి సాయుధ పోరులో నిలబెట్టిన సాహస నారి మల్లు స్వరాజ్యం అని వివరించారు. ఆమె స్ఫూర్తితో ఉద్యమాలు సాగిద్దామని పిలుపునిచ్చారు. ముందుగా స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా సీనియర్ నాయకురాలు వై.అంజనీదేవి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు బి.రాజ్యలక్ష్మి, నాయకులు బి.గోవిందమ్మ, కె.రాణి, పి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా మనోబలానికి మచ్చుతునక..

సునీతా విలియమ్స్

ఒంగోలు మెట్రో: తొమ్మిది రోజుల ప్రయాణం కోసమని వెళ్లి తొమ్మిది నెలల పాటు అంతరిక్షంలోనే ఉండి నేడు అవనికి తిరిగొచ్చిన సునీతా విలియమ్స్ మహిళా లోకానికి స్ఫూర్తి అంటూ ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ కొనియాడారు. బుధవారం ఉదయం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో మహిళాభ్యుదయ సమితి, నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళాశక్తిని లోకానికి చాటిన సునీతా విలియమ్స్ ప్రపంచంలోని మహిళలందరికీ గర్వకారణమని అన్నారు. కేక్ కట్ చేసి ఆమెను స్వాగతించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, మారేపల్లి సూర్యకుమారి, నాళం నరసమ్మ, బీరం అరుణ, గుంటూరు శ్రీదేవి, మలాన్ భాను, సీహెచ్ కనక దుర్గ, పి.నాగేంద్రమ్మ, మహిళాభ్యుదయ సమితి సభ్యులు పాల్గొన్నారు.

12 మంది వాహనదారులకు జరిమానా

ఒంగోలు సిటీ: విజిబుల్ పోలీసింగ్, వాహన తనిఖీలలో భాగంగా ఒంగోలు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది తనిఖీలు చేస్తుండగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 12 మందిని బుధవారం స్పెషల్ జేఎస్సీఎం మేజిస్ట్రేట్ వీఎస్ రామారావు వద్ద హాజరుపరిచినట్లు ట్రాఫిక్ సీఐ పాండురంగారావు తెలిపారు. వారిలో 11 మంది వాహనదారులకు రూ.31,000 జరిమానా, ఒకరికి రూ.5 వేల జరిమానా, 2 రోజులు బెయిలు లేని జైలు శిక్ష విధించినట్లు వివరించారు. వాహనదారులంతా రూల్స్ పాటించాలని తెలిపారు.